

మత్స్యకారుల ఎదురీత!

జిల్లాలో నిర్లక్ష్యానికి గురైన మత్స్య పరిశ్రమకు ఊతమిస్తే మంచి సాధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. పెనుమూరు మండలంలో చాలాకాలంగా ప్రతిపాదన దశలో ఉన్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఎన్టీఆర్ జలాశయ సమీపంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో భూమిని సేకరించారు. జలాశయం దిగువన కల్వకుంట గ్రామంలో 6.12 ఎకరాలను ఇందుకు కేటాయించారు. ఏటా కోటికిపైగా చేప పిల్లల్ని ఉత్పత్తి చేయాలని, 50 వేల పెద్ద చేపల్ని పెంచాలనే లక్ష్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి రూ.4.5 కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రభుత్వానికి ఏడేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటైతే ప్రత్యక్షంగా 200 మందికి, పరోక్షంగా అంటే మత్స్య సంపద సేకరణ, వాటి విక్రయం ద్వారా సుమారు 10 వేల మందికిపైగా ఉపాధి పొందే అవకాశం ఉంది.అయితే ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ స్పందన లేకపోవడమే విచారకరం.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తే సత్ఫలితాలు

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం











● ఈ ఏడాదికి 25 లక్షల చేప పిల్లలు

ప్రస్తుతం పలమనేరు, కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం ప్రాంతాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్య క్షేత్రాలను నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కాస్త పెద్దవిగా ఉండే సిమెంటు తొట్టెల్లో చిరు చేప పిల్లల్ని పెంచుతున్నారు. మూడు రోజుల వయసున్న పిల్లల్ని తీసుకొచ్చి, నాలుగు నెలలు అయ్యాక అన్నమయ్య జిల్లాలోని సోమశిల రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌లో వదిలేస్తారు. ఇలా గత ఏడాదిలో 38 లక్షల చిరు చేప పిల్లల్ని పలమనేరు, కృష్ణాపురం మత్స్య క్షేత్రాల్లో వదలగా, 7.60 లక్షల చేపలు ఉత్పత్తి అయ్యాయి. వీటిని సోమశిల రిజర్వాయర్‌లో వదిలారు.ప్రస్తుత ఏడాదికి గానూ 25 లక్షల చేపల్ని పెంచాలని లక్ష్యం పెట్టుకున్నారు. సోమశిల రిజర్వాయర్ పరిధిలో ఆ జిల్లాకు చెందిన సుమారు 400 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు. వీరు అక్కడ చేపల్ని పట్టుకుని అమ్ముకుంటుంటారు.

● సహజంగా పెరిగే చేపలు

కొరమేను, జిలేబీ, తేలు చేప, మారువాయ్, కోళపక్కీ, బుడ్డపక్కీ, జెల్లలు, ఉలస వంటి చేపలు చెరువుల్లో సహజంగా పెరుగుతున్నాయి. వీటిని మత్స్యకారులు పట్టుకుని అమ్ముకుంటారు. క్యాట్ల, బంగారుతీగ, పాప్లేట్ వంటి రకాల్ని చెరువుల్లో, కుంటల్లో వదిలి పెంచుకుంటారు. వీటిని మత్స్యకారులతో పాటు తినేందుకు రైతులు కూడా పెంచుకుంటారు. కట్ల, రోహు,మోసు (మృగాల) రకాల్ని మాత్రమే మత్స్య శాఖ తరఫున ఆయా క్షేత్రాల్లో పెంచుతున్నారు.

చెరువులతో పంచాయతీలకు ఆదాయం : గ్రామ పంచాయతీ నిర్వహించే చెరువుల వేలం పాటల్లో ఆయా ప్రాంతాల మత్స్యకారులు పాల్గొని ఏడాది కోసం అనుమతి దక్కించుకుంటారు.రకరకాల చేప పిల్లల్ని వదిలి పెంచుకుని అమ్ముకుంటారు. ఇలా జిల్లాలో సుమారు 470కి పైగా చెరువులున్నాయి. ఉదాహరణకు బంగారుపాళ్యం పంచాయతీలో 20 చెరువులుండగా, 7 చెరువులకు వేలం పూర్తయింది. చెరువు విస్తీర్ణం, పోటీదారుల్ని బట్టి వేలం రూ.15 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది. మరీ విస్తీర్ణం ఎక్కువగా ఉంటే (70-100 ఎకరాలు) రూ.2.50 లక్షల వరకు వేలంపాటలు సాగుతాయి.

31 సహకార సంఘాలు

మత్స్య శాఖ ద్వారా జిల్లాలో మత్స్యకారుల్ని సహకార సంఘాలుగా రిజిస్టర్ చేశారు. 20 సంఘాల్లో 896మంది పురుషులు, 11 సంఘాల్లో 273 మంది మహిళలు జీవనోపాధి కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. మత్స్య సాగుబడి పథకం ద్వారా చెరువుల్లో చేప పిల్లల్ని వదలడంపై అవగాహన కల్పిస్తున్నారు.

మత్స్యకారులకు ప్రోత్సాహకాలు : జిల్లాలో 50 ఏళ్ల పైబడిన 243 మంది మత్స్యకారులకు పెన్షన్లు అందిస్తున్నారు.83 మంది మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల్ని మంజూరు చేశారు. వీటి ద్వారా వారికి రూ.24.40 లక్షల రుణాలు ఇచ్చారు. జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లలో చేపల పెంపకం ద్వారా ఇప్పటివరకు 118 టన్నుల మత్స్య సంపద వచ్చింది.





పుంగనూరులో కిలో టమోటా రూ.43

పుంగనూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కిలో టమోటా రూ.43.40 పలికింది.కొద్దిరోజులుగా మార్కెట్‌లో టమోటా ధరలు పడిలేస్తున్నాయి. గురువారం మొదటిరకం టమోటా కిలో రూ.43.40, రెండో రకం రూ.34.70, మూడో రకం రూ.26 పలకగా వ్యాపారస్తులు యార్డుకు వచ్చిన 44.10 మెట్రిక్ టన్నులను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.పలమనేరులో మొదటిరకం టమోటా కిలో రూ. 45, రెండోరకం రూ.43, మూడో రకం రూ.40, వి.కోటలో మొదటిరకం రూ. 42, రెండోరకం రూ.39, మూడో రకం రూ.35, అన్నమయ్య జిల్లా మదనపల్లె మార్కెట్‌లో మొదటిరకం రూ.61, రెండోరకం రూ.58, మూడో రకం రూ.50,కలికిరి మార్కెట్‌లో మొదటిరకం రూ.46, రెండో రకం రూ.42, మూడో రకం రూ.38 చొప్పున విక్రయాలు జరిగాయి.

కమర్షియల్ ట్యాక్స్ జేసీపై విచారణ

చిత్తూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిత్తూరు కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అటెండర్లను కులంపేరుతో దూషించి దాడి చేశారంటూ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డిపై గతంలో వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ గురువారం మొదలైంది.విజయవాడ నుంచి వచ్చిన స్టేట్ టాక్స్ అడిషనల్ కమిషనర్ బాలాజీ బాబు గురువారం ఉదయం చిత్తూరు కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. అటెండర్లు భరత్, లవకుమార్లను మొదట బాలాజీ బాబు విచారించారు.అలాగే కార్యాలయంలోని ఉద్యోగులందరినీ కూడా ఆయన విచారించారు. రాత్రి 7 గంటల వరకూ ఈ విచారణ కొనసాగింది.

గుడిపాలలో బెంగళూరు పోలీసులు

● రూ.7 కోట్ల దోపిడీ ముఠా కోసం గాలింపు
● వాహనాన్ని వదిలేసి వెళ్లిన దుండగులు

చిత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో రూ.7.11 కోట్ల నగదును దుండగులు బుధవారం పట్టపగలే దోపిడీ చేసిన విషయం తెలిసిందే. ఆ వాహనాన్ని బుధవారమే గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలో వదిలేసి వెళ్లిపోగా, బెంగళూరు పోలీసులు వెతుక్కుంటూ గురువారం గుడిపాలకు వచ్చారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరు నగరం జేపీనగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి నగదు తీసుకుని ఏటీఎంలో నింపడానికి ఓ ఏజెన్సీ వాహనంలో బుధవారం సిబ్బంది వెళుతుండగా.. జయనగర్ సౌత్ ఎండ్ సర్కిల్‌లో 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' అనే స్టిక్కర్ అతికించి ఉన్న కేఏ03 ఎన్‌సీ 8052 నంబరు ఇన్నోవా కారు వచ్చి అడ్డగించింది. తాము ఐటీ అధికారులమని బెదిరించి, డ్రైవర్ మినహా గన్‌మెన్, మరో ఉద్యోగిని వాహనం నుంచి దించేశారు. ముఠాలోని ఇద్దరు వ్యక్తులు నగదు ఉన్న ఏజెన్సీ వాహనంలోకి ఎక్కి, డెయిరీ సర్కిల్‌లోని జయదేవ ఆస్పత్రి వైపు మళ్లించారు. అక్కడి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఏజెన్సీ వాహనాన్ని ఆపి, అందులోని నగదును ఇన్నోవా కారులోకి మార్చారు. తర్వాత ఇన్నోవాలో ఆ ముఠా పారిపోయింది. అలా పారిపోయిన ఆ ముఠా బుధవారమే గుడిపాల సమీపంలో ఆ ఇన్నోవాను వదిలేశారు. అక్కడి నుంచి మరో వాహనంలో తమిళనాడు వైపు వెళ్లిపోయారా.. గుడిపాల మండలంలోనే ఏదో ఓ ప్రాంతంలో నక్కి ఉన్నారా.. అనేది పోలీసులు తేల్చాల్సి ఉంది. పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ స్వయంగా విచారణను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. అందులో ఓ బృందం గురువారం గుడిపాలకు చేరుకుని ముఠాకు చెందిన ఇన్నోవా కారును స్వాధీనం చేసుకుంది. బెంగళూరు నుంచి వచ్చిన బృందంలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు తమ సిబ్బందితో కలిసి గుడిపాల మండలంలోని చిత్తపార, రామాపురం వంటి గ్రామాలతో పాటు అటవీ ప్రాంతాల్లో కూడా ముఠా కోసం గాలిస్తున్నారు.

'పద్మావతి' చెంత ప్రథమ పౌరురాలు



రేణిగుంటలోని విమానాశ్రయం

ఏడుకొండల స్వామి దర్శనానికి దేశ ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం సాయంత్రం జిల్లాకు వచ్చారు. తిరుచానూరులో పద్మావతి అమ్మవారిని దర్శించుకుని తిరుమల చేరుకున్న ఆమె.. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- రేణిగుంట/తిరుచానూరు/తిరుమల, ఆంధ్రజ్యోతి

సాయంత్రం 4.05 గంటలు. ఒడిశా రాష్ట్రం ఝార్సుగూడా నుంచి ప్రత్యేక విమానం రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకుంది. విమానం నుంచి దిగిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘన స్వాగతం లభించింది. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్, ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఐజీ రాజకుమారి, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

ఆలయంలో అర్ధగంటకు పైగా

పద్మావతి ఆలయం వద్ద గ్రీన్ రూమ్‌లోకి వెళ్లిన రాష్ట్రపతి పది నిమిషాలు విశ్రాంతి తీసుకున్నారు. 4.55 గంటలకు ఆలయంలోకి విచ్చేశారు. మొదట ధ్వజస్తంభానికి మొక్కారు. సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. లడ్డూ ప్రసాదాలతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని ఈవో బహూకరించారు. ఆలయం వెలుపలకు వచ్చిన ఆమె 5.26 గంటలకు తిరుమలకు బయలుదేరారు.





పద్మావతి అమ్మవారి ఆలయం

4.40 గంటలు: కుమార్తె, మనవడు, మనవరాలు తదితరులతో కలిసి రాష్ట్రపతి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహద్వారం వద్ద దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి అనిత, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చకులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరిందర్‌నాథ్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్క్ హార్డ్ అండ్ అచీవ్ లాట్!



డీకేపల్లె చెరువులో జలహారతి

● విజయానికి దగ్గరి దారి లేదన్న నారా భువనేశ్వరి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన క్యూలో నిలుచున్న భువనేశ్వరి

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'విజయానికి దగ్గరి దారి అనేది లేదు. వర్క్ హార్డ్ అండ్ అచీవ్ లాట్ అంతే.' ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ అన్న మాటలివి. కుప్పం నియోజకవర్గ పర్యటనలో రెండవ రోజైన గురువారంనాడు ఆమె కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పరమసముద్రం గ్రామం వద్ద గల కేజీబీవీ, గురుకుల పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.పేద కుటుంబాలనుంచి ఎన్నో కష్టనష్టాలకోర్చి ఇక్కడిదాకా వచ్చి చదువుకుంటున్న పిల్లలు బాధ్యతగా మెలగాలని సూచించారు. 'మీలాగే ఎంతోమంది పేద పిల్లలు ఎన్టీఆర్ ట్రస్టు స్కూల్‌లో చదువుకుంటున్నారు. అక్కడ నూరు శాతం రిజల్ట్స్ వస్తాయి. నాకు ఆ పిల్లల్ని చూస్తే చాలా గర్వంగా ఉంటుంది.' అన్నారు. చదువు విలువ ఏమిటో తనకంటే పిల్లలకు బాగా తెలుసన్నారు. అబ్దుల్ కలాం, ధీరూబాయ్ అంబానీ, నందమూరి తారకరామారావు, చంద్రబాబు నాయుడు వంటివాళ్లు కూడా పేద, మధ్యతరగతి కుటుంబాలనుంచి వచ్చి ఉన్నత స్థానాలకు చేరారని గుర్తు చేశారు. ఇంకా ఎంతోమంది పేదరికాన్ని ధిక్కరించి ఎన్నో లక్ష్యాలను సాధించారని అటువంటివారిని ఆదర్శంగా తీసుకోవాలని ఉద్బోధించారు.'ఒక తల్లిగా చెబుతున్నా.ముఖ్యంగా టీనేజిలో ఉన్న ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరినీ నమ్మొద్దు. చదువుమీద ఉన్నత లక్ష్యంమీద ఫోకస్ ఉండాలి. జీవితంలో పైకి ఎదగాలి.' అని సందేశం ఇచ్చారు. ఏదీ ఈజీగా రాదని, శ్రమిస్తేనే ఏ విజయమైనా దక్కుతుందని ఉద్బోధించారు. అంతకుముందు భువనేశ్వరి విద్యార్థుల దగ్గరకు వెళ్లి, వారు చదువుతున్న కోర్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖాముఖి అయిన తర్వాత విద్యార్థులను మాట్లాడమని అడిగారు. ఈ సమయంలో ఒకరిద్దరు విద్యార్థులు పైకి లేచి తమకు కంప్యూటర్ ల్యాబ్ కావాలని కోరారు. ఎన్ని కంప్యూటర్లు కావాలి? ల్యాబ్‌కోసం గది వుందా? అని ప్రిన్సిపాల్‌ను భువనేశ్వరి ప్రశ్నించారు. గది ఉన్నదని, 20 కంప్యూటర్లు సరిపోతాయని ఆమె చెప్పారు. దీంతో తనకు లెటర్ పెడితే కచ్చితంగా కంప్యూటర్లు పంపుతానని భువనేశ్వరి హామీ ఇచ్చారు. కేజీబీవీ స్కూల్‌లోనే విద్యార్థులతో కలిసి మెనూ ప్రకారం వొండిన సాధారణ భోజనం చేశారు. కేజీబీవీ స్కూల్‌నుంచి సమీపంలోనే ఉన్న గురుకుల పాఠశాలకు వారితో కలిసి ఆటోలో ప్రయాణించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్, రెస్కో ఛైర్మన్ వీజీ.ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిపురం, రామకుప్పం మండలాల్లో నేడు పర్యటన

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) ఎన్టీయార్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడో రోజైన శుక్రవారం శాంతిపురం, రామకుప్పం మండలాల్లో పర్యటించనున్నారు.శుక్రవారం ఉదయం 9 గంటలకు శాంతిపురం మండలం శివపురం వద్ద గల స్వగృహం వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు.ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంలో లబ్ధిపొందుతున్న మహిళలతో కలిసి ఉదయం 10గంటలకు ఆర్టీసీ బస్సులో బయలుదేరి తుమ్మిశి పెద్దచెరువు వద్దకు చేరుకుంటారు. 10.30గంటలకు చెరువులో జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు.11.45గంటలకు నడింపల్లె గ్రామంలో మహిళలతో సమావేశమవుతారు. ఒంటిగంటకు శాంతిపురం-కెనమాకులపల్లె రహదారిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 1.15గంటలకు శాంతిపురంలో వైభవ్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు రామకుప్పం మండలం విజలాపురం చెరువులో జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. 3.45గంటలకు ఆనిగానూరులో, సాయంత్రం 5గంటలకు బల్లలో మహిళలతో సమావేశమవుతారు.

డిసెంబరు నుంచి రాగుల, జొన్నల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులందరికీ డిసెంబరు నెల నుంచి బియ్యం కోటాలో కేజీ వంతున రాగులు, జొన్నలు పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ లక్ష్మి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం జిల్లాకు 350 టన్నుల జొన్నలు, 350 టన్నుల రాగులను కేటాయించిందన్నారు. చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించడంలో వీటిని పంపిణీ చేస్తామన్నారు. కార్డుదారుల్లో ఒక్కొక్కరికి ఇస్తున్న బియ్యం కోటాలో ఒక్కొక్క కేజీ వంతున రాగులు,జొన్నలు అందిస్తామన్నారు.

నేడు మార్కెట్ యార్డులో మ్యాంగో క్లస్టర్ వర్క్‌షాప్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరు మార్కెట్ యార్డులో మ్యాంగో క్లస్టర్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధరం, ఆనందనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హార్టికల్చరల్ బోర్డు, రాష్ట్ర ఉద్యానశాఖ పర్యవేక్షణలో చిత్తూరు మ్యాంగో క్లస్టర్ ఏర్పాటు లక్ష్యాలు, అవసరాలు, విధివిధానాలపై జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన రెడ్డి వివరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఔత్సాహిక రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.



రామదూతపై అభయప్రదాత

తిరుచానూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామదూత హనుమంతుడిని వాహనంగా చేసుకుని పట్టాభిరామునిగా పద్మావతి అమ్మవారు గురువారం రాత్రి భక్తులకు అభయమిస్తూ ముందుకు సాగారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై మురళీకృష్ణ అలంకరణలో అమ్మవారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.మధ్యాహ్నం శ్రీకృష్ణ స్వామి ముఖమండపంలో ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం.. సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు ● ఉదయం 8 గంటలకు పల్లకీ ఉత్సవం ● సాయంత్రం 3.30 గంటలకు వసంతోత్సవం ● రాత్రి 7 గంటలకు గజ వాహనసేవ.



శ్రీవారిసేవలో మంత్రి అచ్చెన్నాయుడు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే సినీ నిర్మాత దిల్ రాజు సతీమణి తేజశ్విని కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

→ అచ్చెన్నాయుడికి ప్రసాదాలు అందజేస్తున్న అదనపు ఈవో


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,121

తలనీలాలు సమర్పించినవారు: 22,426





తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వాహన సేవల ముందు విభిన్న సంస్కృతులు, కళాప్రదర్శనలు భక్తుల మనసును దోచాయి. రాత్రి జరిగిన హనుమంత వాహన సేవ ముందు.. ఫ్యూజన్ క్లాసికల్, కోలాటం, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అండాల్ వైభవం, చెక్కభజన, అమరావతి డ్రమ్స్, కోలాటం, ఎస్వీ సంగీత , నృత్య కళాశాల ఆధ్వర్యంలో శ్రీరామపట్టాభిషేకం, భరత నాట్యం, నెమలినృత్యం, దాస ప్రాజెక్టు ఆధ్వర్యంలో అష్టలక్ష్మి వైభవం, తాళం డ్యాన్స్, కోలాటం ఆకట్టుకున్నాయి.
హనుమంత వాహనసేవలో మొత్తం 15 కళాబృందాలు ప్రదర్శనలు చేశాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



మనసు దోచిన కళారూపాలు



నేడు అమ్మవారికి గజవాహనసేవ



మాడవీధుల్లో తొక్కిసలాట జరగకుండా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

తిరుచానూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజవాహన సేవ జరగనుంది. తిరుమలలో శ్రీవారి గరుడసేవకున్న ప్రాముఖ్యత.. తిరుచానూరులో గజవాహనసేవకు ఉంటుంది. తిరుపతి నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గజవాహన సేవ తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలివస్తారు. దీంతో మాడవీధుల్లో ఎలాంటి తొక్కిసలాటలు, తోపులాటలు చోటుచేసుకోకుడా టీటీడీ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసింది. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఆలయ మాడవీధుల్లో గజవాహన సేవ ఏర్పాట్లు పరిశీలించారు. ఎక్కడా భక్తులు ఇబ్బంది పడకుండా పోలీసు, విజిలెన్సు సమన్వయంతో పనిచేయాలన్నారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతిరోజు వాహన సేవలు రాత్రి 9 గంటలకు ముగిస్తే, గజ, గరుడ వాహనసేవలకు మాత్రం రాత్రి 11గంటల వరకు వాహనసేవ కొనసాగే అవకాశం ఉంది.

తిరుమల నుంచి నేడు లక్ష్మీకాసుల హారం రాక

గజవాహన సేవ నేపథ్యంలో అమ్మవారికి అలంకరించేందుకు తిరుమలలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని శుక్రవారం ఉదయం తీసుకురానున్నారు. ఈ హారాన్ని శోభాయాత్రగా తీసుకొచ్చి.. గజవాహన సేవలో అమ్మవారికి అలంకరిస్తారు.

అన్యమత చిహ్నాలతో తిరుమలకు వాహనం

● అలిపిరి భద్రతా ఉద్యోగిపై చర్యలు



తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్యమత చిహ్నాలతో ఉన్న వాహనాన్ని గుర్తించి అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహించారంటూ అలిపిరి టోల్ సిబ్బంది ఒకరిని విధుల నుంచి టీటీడీ తొలగించింది. టీఎన్ 31 ఏఈ 4073 నెంబరు గల టెంపో ట్రావెలర్ గురువారం అలిపిరి దాటి నిరాటంకంగా తిరుమలకు చేరుకుంది. ఫైర్‌స్టేషన్‌కు వెనుక పార్కింగ్‌లో ఉన్న తమిళనాడుకు చెందిన ఈ వాహనంలో అన్యమత చిహ్నం, స్టిక్కర్‌తో ఉండడాన్ని కొందరు గుర్తించి విజిలెన్స్, మీడియాకు సమాచారమిచ్చారు. విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని అన్యమత చిహ్నాలను తొలగించారు. కాగా అలిపిరి తనిఖీ కేంద్రంలోని తొమ్మిదోలైన్ నుంచి వాహనం వచ్చిందని గుర్తించి, అక్కడ విధుల్లో ఉన్న వాసు అనే భద్రతా ఉద్యోగిని తొలగించి, శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని టీటీడీ తెలిపింది. వాహన డ్రైవర్ గోబి, యజమానిపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు





పోలీసు ఆంక్షలతో నిర్మానుష్యంగా ఉన్న పద్మావతి అమ్మవారి ఆలయ పరిసర వీధులు - కలెక్టరేట్ వద్ద హైవేపై ఆగిన వాహనాలు

తిరుచానూరు/తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా గురువారం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద ఉన్న టాక్సీలను ఉదయం నుంచీ పార్కింగ్‌లోకి తరలించారు. టాక్సీ బుకింగ్ కౌంటర్ల వద్ద ఎవరినీ అనుమతించలేదు. ఇక, మధ్యాహ్నం 3 గంటల తర్వాత హైవే నుంచి అమ్మవారి ఆలయం వరకున్న మార్గంలో రాకపోకలను నిషేధించారు. తిరుపతి నుంచి తిరుచానూరుకు యధావిధిగా రాకపోకలకు అనుమతించారు. ఆలయ సన్నిధి వీధిలోనూ దాదాపు రెండు గంటల పాటు ఎవరినీ రానీయలేదు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను సాయంత్రం 4గంటల వరకు అనుమతించి.. ఆపై ఆపేశారు. రాష్ట్రపతి అమ్మవారిని దర్శించుకుని తిరుమలకు బయలుదేరాక భక్తులను యథావిధిగా అనుమతించారు. రాష్ట్రపతి రాక సందర్భంగా జాతీయ రహదారిలో కొంతసేపు ఇరువైపులా వాహన రాకపోకలను పోలీసులను నిలిపివేశారు. అక్కడక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. ఇక, తిరుమలలోనూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి బస చేసే అతిథిగృహం వద్ద పటిష్ఠ భద్రతను కల్పించారు. పాసులున్న అధికారులు, సిబ్బంది మినహా మిగతా ఎవరూ ఆ ప్రాంతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే రాష్ట్రపతి కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. కాన్వాయ్ రావడానికి ముందే దుకాణాలు మూసివేయాలనే ఆదేశాలు జారీ చేశారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకరిస్తాం

● కుప్పం నియోజకవర్గ ప్రజలు ముందుకు రావాలన్న సదరన్ డిస్కం సీఎండీ



సోలార్ విద్యుత్ ప్లాంటును పరిశీలిస్తున్న సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

శాంతిపురం/తిరుపతి(ఆటోనగర్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజలు ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ అన్నారు. శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సూర్యఘర్ యోజనలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ పనులు, బల్ల వద్ద నిర్మాణ దశలో వున్న 33-11 కేవీ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించారు. గృహాలపై జరుగుతున్న సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణపనుల తీరును చూశారు. ఈ పథకం అమలుతో కలిగే ప్రయోజనాలను తమ సిబ్బంది వివరించారా అని గృహ యజమానులను అడిగారు.సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం కుసుం పథకం కింద ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పనుల్లో భాగంగా 4.9 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ప్లాంట్ పూర్తి చేస్తే రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సదరన్ డిస్కం డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్, రెస్కో ఎండీ ఎస్.సోమశేఖర్, చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఛాతీ భాగంలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డు

● శస్త్ర చికిత్సతో రాడ్డును తొలగించిన రుయాస్పత్రి వైద్యులు



పది రోజుల కిందట బాధితుడి ఛాతీభాగంలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డు

తిరుపతి(వైద్యం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ఓ వ్యక్తి ఛాతీ భాగానికి రెండు వైపులా 1.5 మీటర్ల ఇనుపరాడ్డు చొచ్చుకుపోయింది. అతిక్లిష్టమైన శస్త్రచికిత్సతో ఆ రాడ్డును తొలగించి ఆ వ్యక్తి ప్రాణాలు నిలబెట్టడం గొప్ప విషయం' అని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ అన్నారు. తిరుపతిలోని రుయాస్పత్రిలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'అనంతపురానికి చెందిన షేక్ వల్లి(44) ద్విచక్ర వాహనంపై దుస్తులు అమ్ముకుంటూ శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. పదిరోజుల కిందట దుస్తుల వ్యాపార నిమిత్తం నగరికి వెళ్లి తిరిగి పుత్తూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో రహదారిపై బస్సును అధిగమించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి కింద పడ్డారు. ఆ సమయంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండటంతో అక్కడ ఏర్పాటు చేసివున్న 1.5 మీటర్ల ఇనుపరాడ్డు అతని ఛాతీ భాగంలో ఒక వైపు గుచ్చుకొని మరో వైపు బయటకు వచ్చింది. అదే సమయంలో అటుగా వెళ్లే కొందరు 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో వారు ఆయన్ను రుయాస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో బాధితుడు స్పృహలో లేకపోవడం, అతడి వివరాలు వెల్లడించేందుకు కుటుంబ సభ్యులూ లేరు. బాధితుడి పరిస్థితి చూసి రుయాస్పత్రిలోని కార్డియోథొరాసిక్, అనస్థీషియా, సర్జరీ విభాగాల వైద్యాధికారులు హుటాహుటిన శస్త్రచికిత్సను ప్రారంభించారు. దాదాపు రెండు గంటలు శ్రమించి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను చేసి వ్యక్తి శరీరంలో ఊపిరితిత్తులకు, గుండెకు మధ్యలో చొచ్చుకుపోయిన ఇనుపరాడ్డును తొలగించి బాధితుడి ప్రాణాలు నిలబెట్టారు. శస్త్ర చికిత్స అనంతరం పది రోజులుగా షేక్ వల్లిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. పూర్తి ఆరోగ్యంగా కోలుకున్న తర్వాత గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశాం' అని ఆమె తెలిపారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల్లో అనుభవం కలిగిన వైద్యనిపుణులు కళ్యాణి రమ, గౌతమి, పద్మ, శ్రీనివాసులు, జ్ఞాపిక, రవిశంకర్ బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేసి రుయాస్పత్రి స్థాయిని మరింత పెంచారని ఆమె అభినందించారు. పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్న ఇటువంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన ప్రాణాలు నిలబెట్టిన వైద్యులకు షేక్ వల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

తులసీనాథం దంపతులకు
కలెక్టర్ అభినందనలు



చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్పలను గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ శాలువాలు కప్పి సత్కరించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. 2 లక్షల పుస్తకాలను ఉచితంగా పంచిపెట్టి తెలుగుభాషకు వారు చేస్తున్న సేవలను గుర్తించి కలెక్టర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జీవీ రమణ, యుగంధర్‌బాబు, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధ

తిరుపతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖలో సమగ్ర శిక్షా విభాగం అదనపు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా తిరుపతి పద్మావతీ మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నున్నం అనురాధ నియమితులయ్యారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది జిల్లాలకు వేర్వేరు శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులను డెప్యుటేషన్‌పై సమగ్ర శిక్షా ఏపీసీలుగా నియమించింది. అందులో భాగంగా స్థానిక మహిళా వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధను డెప్యుటేషన్‌పై అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీగా నియమించింది. ఈ పోస్టులో ప్రాథమికంగా ఏడాదిపాటు కొనసాగనున్నారు.

రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ ఉద్యోగులకు అభినందన



విజేతలకు బహుమతులను అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గెలుపోటములను పక్కన పెట్టి ఆత్మ విశ్వాసంతో పోటీపడాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలియజేశారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు అనంతపురంలో 7వరాష్ట్ర స్థాయి రెవెన్యూస్పోర్ట్స్, కల్చరల్ మీట్ జరిగింది. ఇందులో చిత్తూరు జిల్లా రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో కబడ్డీ, క్రికెట్‌లో విన్నర్లుగా, క్యారమ్స్‌లో రన్నర్‌గా నిలిచారు. మహిళా విభాగంలో త్రోబాల్, టెన్నీకాయిట్ విభాగంలో విన్నర్‌గా నిలిచారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా విభాగం ఆధ్వర్యంలో విజయోత్సవ సమావేశం జరిగింది. విజేతలకు కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడేల్, డీఆర్వో మోహన్‌కుమార్‌లు షీల్డులు, కప్పులను అందించి అభినందనలు తెలిపారు. కేక్ కత్తిరించి కలెక్టర్ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి సుధా, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య



అనూష (ఫైల్ ఫొటో)

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందన్న కారణంతో కుప్పంలో అనూష (17) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కుప్పం మండలం మంకలదొడ్డి పంచాయతీ, డి.అగ్రహారం గ్రామానికి చెందిన దీప, వెంకటేశ్ అనే తల్లిదండ్రులకు కుమార్తె అనూష, కుమారుడు శివ ఉన్నారు. అనూష కుప్పం పాలిటెక్నిక్‌లో డిప్లమో ద్వితీయ సంవత్సరం, శివ కుప్పంలో డిగ్రీ చదువుతున్నారు. అనూషకు ఈనెల 5వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే చదువుతో పాటు ఇంట్లో పశువులకు మేత వేయడం, కట్టేయడం వంటి పనులు చేయాలని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అనూష ఇంటి నుంచి వెళ్లి గ్రామానికి సమీపంలోని ఆవులనత్తం గేటు వద్ద పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమేశ్ తెలిపారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య



పల్లవి(ఫైల్ ఫొటో)

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఒక నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... కుప్పం మున్సిపాలిటీ బేవనపల్లెకు చెందిన పల్లవి (19) స్థానిక పీఈఎస్ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురువారం ఆమె కళాశాల భవనం 3వ అంతస్తు పైకి ఎక్కి కిందికి దూకేసింది. గమనించిన సాటి విద్యార్థులు కళాశాల మేనేజ్మెంటుకు చెప్పి, వెంటనే హాస్పిటల్లో చేర్పించారు. అయితే తీవ్రంగా గాయపడిన పల్లవి గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కళాశాలలో ప్రొఫెసర్ల వేధింపులవల్లే తమ బిడ్డ చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యను సీఐ మల్లేష్ యాదవ్ ధృవీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని చెప్పారు.

కృష్ణమ్మకు జలహారతి

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఉక్కు సంకల్పంతో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ నిర్మాణం సాకారమైంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టునుంచి బిరబిరా తరలివస్తున్న కృష్ణా జలాలతో కుప్పం నియోజకవర్గ పరిధిలోని చెరువులు పూర్తిగా నిండి మొరవలు పారుతున్నాయి. చుట్టూ పచ్చటి చేలతో భూములు కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గురువారం ప్రజలతో కలిసి ఆనందం పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. మొరవ పారుతున్న దళవాయికొత్తపల్లె చెరువులో కృష్ణా జలాలకు హారతి ఇచ్చారు. పసుపు కుంకుమల సారెను కృష్ణమ్మకు సమర్పించి, హారతులిచ్చి భక్తిప్రపత్తులతో మొక్కారు. మున్సిపాలిటీ పరిధిలోని మహిళలు, ఇతర ప్రజలు పెద్దయెత్తున డీకేపల్లె చెరువుకు తరలివచ్చి, ఈ సంబరంలో ఆమెతో పాటు పాలుపంచుకున్నారు.



కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని సామగుట్టపల్లె పాఠశాలలో 'విలువల బడి' రూపకర్త లెనిల్‌తో మాట్లాడుతున్న భువనేశ్వరి

తూర్పు నుంచి పశ్చిమానికి ఒంటరి ఏనుగు

● మామిడి, కొబ్బరి, కర్జూరం చెట్లు ధ్వంసం

కల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న ఒంటరి ఏనుగు బుధవారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోకి దాటుకుంది. బుధవారం రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి పాళెం పంచాయతీ కోటపల్లి వద్దకు ఒంటరి ఏనుగు చేరుకుంది. ఎర్రచెరువు సమీపంలోని సయ్యద్‌బాషా మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఒంటరి ఏనుగు రైతు మునిరత్నంనాయుడుకు చెందిన మామిడి, కర్జూరం చెట్లను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకొని రైతులు శరత్, మునిశంతన్ మామిడి, కొబ్బరిచెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. . ఒంటరి ఏనుగు ఇండేన్ గ్యాస్ గోడౌన్ మార్గంలో చిత్తూరు- కర్నూలు హైవేను దాటుకుంది. అక్కడి నుంచి పూరేడువారిపల్లి, పాతపేట మీదుగా మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ కలబందలను తింటూ పశ్చిమ విభాగం అవిలోకి చేరుకుంది.

కల్లూరు వద్ద ఒంటరి ఏనుగు హల్‌చల్

పులిచెర్ల మండలం కల్లూరు-గంటావారిపల్లి రోడ్డులలో గురువారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. బుధవారం రాత్రి పశ్చిమ విభాగం అడవిలోకి చేరుకున్న ఒంటరి ఏనుగు గురువారం పగలంతా గోగులమ్మ వంక వద్ద సంచరించింది. చీకటి పడే సమయానికి ఒంటరి ఏనుగు రోడ్డుపైకి చేరుకుంది. ఒంటరి ఏనుగును చూసి రహదారిపై వెళ్లే ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఫోకస్ లైట్లు వేసి అరుపులు పెట్టినా ఒంటరి ఏనుగు అడవి వైపు వెళ్లకుండా పాతపేట వైపునకు అడుగులు వేసింది. పాతపేట వద్ద ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేస్తుందనే భయంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.





కలబందలను తినేసిన ఒంటరి ఏనుగు - కొబ్బరిచెట్టును ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

చింతమానత్తంలో జంట ఏనుగులు

రామకుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల అటవీ ప్రాంత ప్రజలను భయాభ్రాంతులకు గురిచేస్తున్న జంట ఏనుగులు బుధవారం రాత్రి సింగసముద్రం సమీపంలోని చింతమానత్తం గ్రామ సమీప పొలాల్లో హల్‌చల్ చేశాయి. పలు పొలాల్లో వరి, రాగి పంటలను ధ్వంసం చేశాయి. విషయం తెలుసుకున్న వెంటనే అటవీ అధికారులు ట్రాకర్లతో కలిసి అక్కడికి చేరుకొని వాటిని అడవిలోకి మళ్లించారు. ననియాల, ననియాలతండా, నారాయణపురం తాండాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులెవరూ రాత్రుల్లో పొలాల వద్దకు వెళ్లరాదని కోరారు.

బీజేపీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్ రెడ్డి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత పదాధికారులపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి దయాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా, మండల అధ్యక్షులు, పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీని క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణ అంశాలను వివరించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, జిల్లా, మండల అధ్యక్షులు, పదాధికారులు పాల్గొన్నారు.

● కేరళ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి: శబరిమలకు వస్తున్న అయ్యప్ప స్వామి భక్తుల పట్ల కేరళ ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరి మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమృతానందమయ మఠం లాంటి ధార్మిక సంస్థలు సేవా చేయకుండా అడ్డుకోవడం హిందువుల పట్ల ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తోందన్నారు. కేరళ ప్రభుత్వం తక్షణం వైఖరి మార్చుకోవాలన్నారు.

టీడీపీ వార్డు కమిటీ ఎన్నికల్లో గొడవలు

క్రమశిక్షణ తప్పిన నేతలకు షోకాజ్ నోటీసులు!





మధుసూదన్‌ను స్టేషన్‌కు తీసుకెళుతున్న సీఐ- ఇరువర్గాలవారికి సర్దిచెబుతున్న పోలీసులు

పుంగనూరు,నవంబరు20(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో గురువారం జరిగిన టీడీపీ సంస్థాగత వార్డు కమిటీ ఎన్నికల్లో రెండు చోట్ల గొడవలు జరిగాయి. టీడీపీ నాయకుడు ఎం.దినేశ్‌పై కొందరు దాడికి పాల్పడగా కుమ్మరవీధిలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పుంగనూరులోని 15వ వార్డు నక్కబండలో టీడీపీ కమిటీని నియోజకవర్గ పరిశీలకులు కె.అమరనాథరెడ్డి, మహేశ్ యాదవ్, స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేస్తుండగా టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి వర్గానికే ప్రాధాన్యత కల్పిస్తున్నారంటూ ఆయన వ్యతిరేక వర్గానికి చెందిన మధుసూదన్‌రాయల్ తదితరులు అడ్డుపడ్డారు. తమవర్గానికి చెందిన వారు వచ్చే వరకు ఎన్నిక ఆపాలని కోరినా సాధ్యం కాదంటూ ఎన్నిక నిర్వహించారు. బుధవారం నుంచి కొంతమంది నాయకులు ప్రతి చోటా తమకు ప్రాధాన్యత ఇవ్వాలని పట్టుబట్టడంతో పార్టీ పరిశీలకులు మాత్రం పార్టీ సభ్యత్వం కలిగి, కుటుంబసాధికారిత సమితిలో ఉన్న వారు స్థానికులే ఉండాలన్నారు. నక్కబండలో కొందరు దుర్భాషలాడుతుండగా కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు తమ స్థలంలో పదేళ్లుగా షెడ్డు పెట్టుకుని జీవనం సాగిస్తూ తమకు వ్యతిరేకంగా ప్రవర్తించడం తగదన్నారు.ఈ విషయం తెలుసుకుని మధుసూదన్ గట్టిగా అరుస్తూ దుర్భాషలాడుతుండగా టీడీపీ నాయకుడు దినేశ్ జోక్యం చేసుకుని గత ఎన్నికల్లో పార్టీకి పని చేసిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పడంతో గొడవ మొదలైంది. దీంతో దినేష్‌పై కొందరు యువకులు దాడి చేయగా నాయకులు శ్రీకాంత్, రామకృష్ణమరాజు, ఇబ్రహీం, పోలీసు గిరి తదితరులు అడ్డుకున్నారు.ఈ విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం 13వ వార్డు కుమ్మరివీధిలో ఎన్నిక సందర్భంగా ఇరువర్గాలు చేరి మధుసూదన్ వెంట వచ్చిన ఓ వ్యక్తిని నెట్టగా అతను కిందపడ్డాడు. దినేశ్ తండ్రి నందీశ్వరయ్యను నెట్టగా పక్కనే కాల్వలో పడిపోయాడు.మరోసారి పోలీసులు లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.ఈ విషయం తెలిసి డీఎస్పీ ప్రభాకర్ పుంగనూరుకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మధుసూదన్, దినేష్‌లను స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. గాయపడిన నందీశ్వరయ్య పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 13వ వార్డులో మునీర్ మహ్మద్ (రాజు), నాగరాజ అధ్యక్షస్థానానికి పోటీ పడగా ఐవీఆర్ఎస్ ఓటింగ్‌కు పెట్టారు. కాగా పుంగనూరులో క్రమశిక్షణ తప్పిన టీడీపీ శ్రేణులపై శాప్ చైర్మన్ రవినాయుడు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడంతో బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.చివరకు పోలీసు బందోబస్తు నడుమ ఎన్నికలు నిర్వహించారు.

గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకండి

గ్రూపు రాజకీయాలతో టీడీపీని బలహీనపరిచేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కాబట్టి గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకాలని శాప్ చైర్మన్, పార్టీ పరిశీలకుడు ఎ.రవినాయుడు సూచించారు.మూడు నెలల్లో పుంగనూరు నియోజకవర్గంలో అన్నీ సర్దుకుంటాయని తెలిపారు.గురువారం నాటి గొడవకు కారకులను సంజాయిషీ కోరుతామన్నారు.కాగా పుంగనూరులో ఏకాభిప్రాయంతోనే టీడీపీ వార్డు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల పరిశీలకులు అమరనాథరెడ్డి, మహేశ్‌యాదవ్ చెప్పారు.పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ఎవరు ప్రవర్తించినా సహించేది లేదన్నారు. పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో వ్యవహరించాలని చెప్పారు.

వడ్డీ వ్యాపారి సహా ఇద్దరు విలేకరులపై కేసు నమోదు

చిత్తూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు తిరిగివ్వాలంటూ బెదిరించిన వడ్డీ వ్యాపారికి సహకరించారంటూ ఇద్దరు విలేకరులపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వాసంతి తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు..గంగాధరనెల్లూరు మండలం ముక్కళత్తూరు పంచాయతీలోని ఎం.నాశంపల్లెకు చెందిన నరసింహులు శెట్టి అదే గ్రామానికి చెందిన గజేంద్ర వద్ద రూ. 1.75లక్షలు అప్పుగా తీసుకున్నాడు.నెలనెలా వడ్డీ చెల్లిస్తున్నాడు.అయితే అసలు ఇవ్వాలని గజేంద్ర పలుమార్లు నరసింహులుశెట్టిపై ఒత్తిడి తెచ్చాడు. ఐదు రోజుల క్రితం నరసింహులుశెట్టికి చెందిన రెండు ఆవులు, దూడను గజేంద్ర పట్టుకెళ్లాడు. ఈ విషయంపై నరసింహులు శెట్టి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వాటిని తిరిగి ఇప్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం గజేంద్ర తనకు ఇవ్వాల్సిన డబ్బుల గురించి చర్చించేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. పెద్దమనుషుల సమక్షంలో రెండు నెలల్లో డబ్బులు ఇస్తానని నరసింహులు శెట్టి చెప్పడంతో వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో అదే రోజు గజేంద్రతో కలిసి ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు చిన్న(నీరజాక్షులు), మునస్వామి కలిసి డబ్బులు ఇప్పుడే ఇవ్వాలని నరసింహులుశెట్టిని బెదిరించారు. వారి బెదిరింపులు తాళలేక, మనస్తాపానికి గురై నరసింహులుశెట్టి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి వాంగ్మూలం ప్రకారం వడ్డీవ్యాపారితో పాటు ఇద్దరు రిపోర్టర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



మంచు ముసుగులో రామకుప్పం

రామకుప్పం ప్రాంతంలో రెండు రోజులుగా దట్టమైన పొగమంచు కురుస్తోంది. ఉదయం 8గంటలైనా మంచు తొలగక పోవడంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. చలి తీవ్రత పెరగడంతో ఉదయం, సాయంత్రం జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే వెనకడుగు వేస్తున్నారు. - రామకుప్పం

మహిళా వ్యాపారవేత్తలకు రోల్ మోడల్‌గా కుప్పం మహిళ



చాయ్ రాస్తా లోగో ఆవిష్కరిస్తున్న భువనేశ్వరి తదితరులు

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళా వ్యాపారవేత్తలకు రోల్ మోడల్‌గా కుప్పం మహిళ నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలో డ్రాక్రా మహిళలకోసం నెలకొల్పనున్న చాయ్ రాస్తా అవుట్‌లెట్ లోగోను గురువారం ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ కుప్పం మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పంలో భాగంగా చాయ్ రాస్తా రూపొందుతున్నదన్నారు. రుచి, శుచి, నాణ్యత ప్రధానంగా కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేయనున్న చాయ్ రాస్తా లే అవుట్‌ను కుప్పంలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. దీనిద్వారా డ్వాక్రా మహిళలకు ప్రతినెలా స్థిరాదాయం లభించడంతోపాటు గౌరవం కల్పించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. మెప్మా భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో చాయ్ రాస్తా ద్వారా మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చనున్నామన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ఇటువంటి అధునాతన వ్యాపారాలు ఎంతో దోహదపడతాయన్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు చాయ్ రాస్తా చక్కటి అవకాశమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పంతోపాటు చిత్తూరు, తిరుపతి, గుంటూరు జిల్లాల్లో సైతం త్వరలోనే తమ అవుట్‌లెట్‌లు ప్రారంభించనున్నట్లు చాయ్ రాస్తా సీఈవో మైకేల్ జోషి చెప్పారు. ఈ కార్యక్రమంలో చాయ్ రాస్తా డైరెక్టర్లు పి.కిరణ్, ఒ.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి రంజిత్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఇంటర్మీడియట్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అవార్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో కోరారు ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో రాష్ట్రవ్యాప్తంగా 3500 మంది దీర్ఘకాలికంగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నా ఇప్పటివరకు రెగ్యులరైజేషన్ కాలేదని గుర్తుచేశారు. ఉద్యోగ భద్రత లేకపోగా, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్డ్‌మెంట్ ప్రయోజనాలు లేవని తెలియజేశారు. పదవీ విరమణ కాలపరిమితి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. వీటితో పాటు రెగ్యులర్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రాస్‌లో ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకాలు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి-తిరుపతి, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం, తిరుత్తణి (తమిళనాడు) ప్రాంతాల్లో ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లో ఖాళీ టీచర్ల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ విభాగంలో ఆరు పోస్టులను స్పెషల్ ఎడ్యుకేషన్ బి.ఎడ్, (యం.ఆర్ అండ్ ఐడీ-ఆర్‌సీఐలో తప్పనిసరి నమోదు) అర్హతతో భార్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రైమరీ టీచర్స్‌లోని ఏడు ఖాళీలను డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్‌తో, స్పీచ్ థెరపిస్టు (పార్టుటైం)లోని ఐదు ఖాళీలను డిప్లొమా ఇన్ హియరింగ్, ల్యాంగ్వేజ్ అర్హతతో భర్తీ చేయనునట్లు వివరించారు. అర్హులైన వారు పది రోజుల్లో దరఖాస్తులను తిరుపతిలోని రాస్ కార్యాలయానికి పంపాలని కోరారు.

26లోపు ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్ష ఫీజు చెల్లించాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది 2026 జనవరిలో నిర్వహించే ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్షకు ఇన్‌సర్వీస్ టీచర్లు ఈ నెల 26లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఎస్టీటీ, గ్రేడ్-2 పండిట్లు, పీడీలు, క్రాఫ్టు, డ్రాయింగ్, టైలరింగ్ స్పెషల్ టీచర్ల కోసం ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం పరీక్ష, గ్రేడ్ వన్ పండిట్ల కోసం సింపుల్ ఓరియంటేషన్ పరీక్షలకు సంబంధించిన ఫీజు మొత్తాన్ని రూ.200లు ఈ నెల 26లోపు చెల్లించాలని కోరారు. రూ.60ల అపరాధ రుసుముతో డిసెంబరు 3వ తేదీలోపు చెల్లించాల్సి ఉందన్నారు.

హెచ్ఎం అకౌంట్ టెస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలోని మున్సిపల్, ఎయిడెడ్, పాఠశాలల్లో వివిధ కేటగిరిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హెచ్ఎం అకౌంట్ టెస్టుకు ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో వరలక్ష్మి గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఒక పేపర్‌కు రూ.100, రెండు పేపర్ల పరీక్ష రాసేందుకు రూ.150 చెల్లించాలని, రూ.60ల అపరాధ రుసుముతో నవంబరు 30వ తేదీ లోపు చెల్లించాలని తెలిపారు.

విద్యార్థులకు భువనేశ్వరి అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న భువనేశ్వరి

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను గురువారం నారా భువనేశ్వరి తమ స్వగృహంలో అభినందించారు. స్వచ్ఛమైన మనసు కలిగిన మనుషులున్న కుప్పంలో అత్యంత క్రమశిక్షణ, విలువలతో కూడిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యా సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో స్వచ్ఛ కుప్పం సాధనకు ఈ స్కూల్ విద్యార్థులు తమవంతు బాధ్యత నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతేకాక విద్యార్థులు స్వచ్ఛ కుప్పం కార్యక్రమంపై గ్రామాల్లో సైతం ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్ డెవలప్ చేసుకొని విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ బీఎం.దయానిధి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పఠనంతో జ్ఞానాభివృద్ధి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న గ్రంథాలయ సంస్థ డైరెక్టర్

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పఠనంతో జ్ఞానం వృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కుప్పంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిరంతర పఠనంతో ఎవరైనా సరే తమ మేధాశక్తిని పెంచుకోవచ్చన్నారు. ముఖ్యంగా పిల్లలు కేవలం పాఠ్య పుస్తకాలనే కాకుండా అనేక రంగాలకు చెందిన పుస్తకాలను ఆసక్తిగా చదవడమనే అలవాటును చేసుకోవాలని సూచించారు. ఇందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. తలిదండ్రులు పిల్లలకు పఠనాశక్తిని పెంపొందించుకునేందుకు తగిన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. తల్లి తండ్రి గురువు తర్వాత పుస్తకాలే దైవంగా భావిస్తే, విలువలతో కూడిన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందని చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామిని ఘనంగా సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిఃవ్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కుప్పం శాఖా గ్రంథాలయాధికారి సత్యవాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో -2 రాజారాం, జిల్లా సాంస్కృతిక కార్యక్రమాల సభ్యుడు గిరిధర్, టీడీపీ నాయకుడు గోపీనాథ్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మహేశ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతుల దృష్టి మళ్లించాలి

పలమనేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రసాయనిక ఎరువుల వినియోగానికి స్వస్తి చెప్పి రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించేందుకు ఆర్‌ఎస్‌కేలు, వ్యవశాయ శాఖ అధికారులు కృషిచేయాలని జేడీఏ మురళీకృష్ణ అన్నారు. గురువారం పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ఆర్‌ఎస్‌కేలకు మూడు రోజులపాటు జరిగే ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమాన్ని జేడీఏ మురళీకృష్ణ ప్రారంభించారు. ఆర్‌ఎస్‌కేలతోపాటు డీపీఎంయూ నుంచి గురుప్రసాద్, డీఎంఎంటీ రాజమ్మ, డీటీటీ విజయ, ఎఫ్‌ఎంటి నాగ రమేష్, ఐసీఆర్‌పివెంకటరామిరెడ్డి హాజరయ్యారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



పెద్దఉప్పరపల్లెలో టీడీపీ కార్యకర్తలను సన్మానించిన నాయకులు

సోమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కలిసి పనిచేయాలని ఎన్నికల పరిశీలకుడు ఎం.ప్రభాకర్ అన్నారు. గురువారం పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ వైపు ఆకర్షించాలన్నారు. గత ప్రభుత్వంలో పార్టీ చూసి పథకాలు అందించారన్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులను నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, యధుశేఖర్ నాయుడు, బాలాజీ నాయుడు, మహేంద్రబాబు, రెడ్డెప్పనాయుడు, హరిప్రసాద్, వేణుగోపాల్ నాయుడు, రమేశ్‌నాయుడు, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



నంజంపేటలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

సోమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. గురువారం ఆవులపల్లె, నంజంపేట సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డంపింగ్ యార్డుల్లో వర్మీకంపోస్టు తయారీకి కార్యదర్శులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యదర్శులు మణికుమార్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నమల్లయ్యతాతకు కుంభాభిషేకం



సోమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కరకమందలో కొలువుదీరిన చెన్నమల్లయ్య తాత ఆలయం, ఎల్లమ్మ దేవత ఆలయాల్లో గురువారం కార్తీకమాసం చివరి రోజున వైభవంగా కుంభాభిషేకం చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆలయాల్లో హోమాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేశారు.

బాటగంగమ్మ ఆలయంలో విశేష పూజలు



బైరెడ్డిపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాట గంగమ్మ ఆలయంలో గురువారం విశేషపూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకపూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు దీపారాధనలతో మొక్కులు చెల్లించుకున్నారు. దేవదొడ్డిలోని అంకాళపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సీహెచ్‌సీ ల్యాబ్ తనిఖీ



ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా క్షయ నివారణాధికారి డా. వెంకటప్రసాద్

వి.కోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణ పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డా. వెంకటప్రసాద్ అన్నారు. గురువారం బుధవారం వి.కోట సీహెచ్‌సీ పరిధిలోని ల్యాబ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఇక్కడి పరీక్షలు, రికార్డులను పరీక్షించారు. పరిసరాలోని ఆరోగ్య కేంద్రాలో క్షయ వ్యాధి లక్షణాలున్న వారిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పంపాలని సిబ్బందికి సూచించారు. గళ్ల పరీక్షలు పాజిటివ్ వస్తే వారికి 6 నెలల పాటు తగిన చికిత్స ఇవ్వాలని తెలిపారు. ఆయన వెంట డా. మురళీ, సూపర్‌వైజర్ హరిప్రసాద్, టెక్నీషియన్ పెంచలయ్య, యువరాజ్, లీలాప్రసాద్ ఇతర సిబ్బంది ఉన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న నేతలు

వి.కోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత విజయ శిఖరాలకు చేరుకోవాలని మండల టీడీపీ అధ్యక్షులు రాంబాబు అన్నారు. వి.కోటలో గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం పోటీలను నిర్వహించి విజేతలకు ప్రశంపసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నేతలు శబరీస్, రాము, కేశవులు, గౌస్‌పీర్, మోహమ్మద్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో సుధాకర్‌రావు

పుంగనూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచి అంటువ్యాధులు ప్రబలకుండ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్య నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో కంపోస్టుయార్డులు ఏర్పాటు చేసి చెత్తను సేకరించి సేంద్రియ ఎరువులు తయారు చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. తడి, పొడి చెత్తను వేరు చేయడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. మొక్కలపెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీపీవో సుధాకర్ హెచ్చరించారు. వైద్య, హౌసింగ్, విద్య, వెలుగు, విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి వివిధ సమస్యలపై జిల్లా కేంద్రానికి ప్రతి గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదులు వస్తున్నాయని, మండల స్థాయిలో అధికారులు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిని కలిసిన నేతలు



సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని కలసిన బీజేపీ నాయకులు

పుంగనూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని పుంగనూరుకు చెందిన ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం చిత్తూరు బీజేపీ కార్యాలయంలో ఆయనను కలసి నియోజకవర్గంలో పార్టీ పటిష్టత, స్థానిక సంస్థల ఎన్నికల కోసం తీసుకోవాల్సిన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌రాజు, పెద్దమరంబాబు, మనోహర్, విశ్వనాథ్‌నాయుడు పాల్గొన్నారు.

50 శాతం రాయితీతో గడ్డి కత్తిరించే యంత్రాలు

సదుం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 50 శాతం రాయితీపై అర్హులైన రైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందని మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. యంత్రం మార్కెట్ విలువ రూ.40,500 కాగా ప్రస్తుతం రూ.20,250లకు అందజేస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నాడు వైభవం.. నేడు దయనీయం

● నల్లపనాయని చారిత్రక కట్టడాల దుస్థితి



తీర్థం సమీపంలో ఉన్న నల్లపనాయని చారిత్రక కట్టడాలు



శౌర్యానికి గుర్తుగా రాతిబండలపై చెక్కబడిన శిల్పకళా ప్రతిమలు

బైరెడ్డిపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లపనాయని చారిత్రక కట్టడాలు దుస్థితిలో ఉన్నాయి. తీర్థంప్రాంతంలోని నల్లపనాయని వంశీయుల చరిత్ర చాటే ఈ కట్టడాలు ఇప్పటికీ విశేషంగా ఇక్కడి ప్రజలు చెప్పుకుంటుంటారు.ధైర్యసాహసాలకు, పోరాటపటిమకు మారుపేరైన నల్లపనాయని వంశీయులు గతంలో తీర్థంప్రాలించేవారు. వారిహయాంలో తీర్థంగ్రామాన్ని ఎంతో అభివృద్ధిచేశారు. చెరువులు, నీటికుంటలు, బావులు నిర్మించారని చెబుతారు. అప్పట్లో యుద్ధానికి వెళ్లిన నల్లపనాయని వంశంలో పురుషులందరూ వీరమరణం చెందడంతో స్త్రీలు సతీసహగమనం చేయడంతో వారి పాలన ముగిసిందని పాతతరం వారు చెబుతారు. అయితే నాడు నల్లపనాయని వంశీయుల వైభవ చిహ్నాలుగా వారు నిర్మించిన కోట, శౌర్యానికి గుర్తుగా రాతిబండలపై ఉన్న శిల్పకళాప్రతిమలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. యేటా సంక్రాంతి సందర్భంగా గ్రామస్తులు నల్లపనాయని గుడివద్ద ప్రత్యేకపూజలు నిర్వహిస్తుంటారు.పురాతనచరిత్ర కలిగిన ఇక్కడి చారిత్ర కట్టడాలు ఆలనాపాలనా కరువై దుస్థితికి చేరుకుంది. అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన

సదుం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గొంగివారిపల్లె పంచాయతీ రాజీవ్ నగర్ కాలనీ సీతారాముల ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించనున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. 22న వేద కీర్తన, జలాధి, ధాన్యాధి వాసం, అభిషేకాలు, కలశ స్థాపన హోమాలు, వేద పారాయణం, సహస్ర కుంకుమార్చన, 23న నాడీసంధానం, మహాకుంభాభిషేకం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, సర్వదర్శనం అనంతరం స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వివరించారు.

ఏకగ్రీవంగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు



తాటిగుంటపాళెంలో సంస్థాగత ఎన్నికల్లో పరిశీలకులు, నాయకులు

సదుం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చింతలవారిపల్లె, రెడ్డివారిపల్లె, అమ్మగారిపల్లె, సదుం గ్రామ పంచాయతీలలో గురువారం టీడీపీ సంస్థాగత ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్లపల్లె అమరనాథ్ గౌడ్, ఎన్నికల పరిశీలకులు కర్లాటి అమరనాథరెడ్డి, శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు రెడ్డిప్రసాద్ రెడ్డి, మండల పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రతిపాదనలు



పనులను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ శమిపతి యాదవ్

పుంగనూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డును అన్ని విధాల అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తున్నట్లు చైర్మన్ నల్లబాల శమిపతియాదవ్ తెలిపారు. గురువారం మార్కెట్ యార్డు ఆవరణలో అపరిశుభ్రంగా ఉన్న స్థలాన్ని ఎక్సకవేటర్‌తో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో ఖాళీ స్థలాల్లో కోల్‌స్టోరేజ్‌లు, గోదాములు నిర్మాణాలు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మార్కెట్‌కు ఆదాయ వనరులను సేకరించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ కార్యదర్శి గోపి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటు



గ్రామ టీడీపీ ఎన్నికలు నిర్వహిస్తున్న పరిశీలకుడు ప్రతాప్‌రాజు

పుంగనూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ టీడీపీ కమిటీలను గురువారం ఎన్నుకున్నారు. మంగళం గ్రామ పంచాయతీ టీడీపీఅధ్యక్షుడుగా మాధవ, రాగానిపల్లెకి మణి, మోదుగులపల్లె అధ్యక్షుడుగా కె. వెంకటరమణ, ఎంసీపల్లె అధ్యక్షుడుగా వెంకటరమణ, సింగిరిగుంటకు మంజునాథ్, మాగాండపల్లెకు శేఖర్, మేలుందొడ్డికి వెంకటరమణలను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు చెప్పారు. భీమగానిపల్లె పంచాయతీలో 5మంది పోటీ చేయడంతో ఎన్నిక వాయిదా వేసినట్లు మండల పరిశీలకులు ప్రతాప్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.శమిపతియాదవ్, మండలపార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు గంగాధర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

పుంగనూరు రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఆరుగురు కోడి పందెంగాళ్లను అరెస్ట్ చేసినట్లు గురువారం రాత్రి ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. పెద్దఅలసాపురం వద్ద కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కోడిపుంజులు, నగదు రూ. 4100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ రాము

పుంగనూరు రూరల్, నవంబరు20(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరముందని తహసీల్దార్ రాము సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో వ్యాస రచనలు, వకృత్వ, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు సమావేశంలో ఎంపీడీవో అప్పాజీ, గ్రంథాలయాధికారులు తులసీనాయక్, నజీబ్‌జాన్, న్యాయవాదులు తోట గిరిధర్, శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, గంగులప్ప, హరి మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం



దాతకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల(కాణిపాకం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన ట్రస్టుకు గుంటూరుకు చెందిన పెద్దిశ్రీధర్ గురువారం రూ.1,00,216 విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామిదర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామిశేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

పుస్తకాలే మంచి నేస్తాలు



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు మంచి నేస్తాలని విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం విజయం కళాశాల సమావేశ మందిరంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా ఎంతో జ్ఞానం సంపాదించుకోవచ్చునన్నారు. గ్రంథాల య సంస్థ కార్యదర్శి శర్మ మాట్లాడుతూ పిల్లలు నీతి కథలు చదవాలని తద్వారా నిజాయితీని అలవరుచుకుంటారన్నారు. వంద మంది స్నేహితులు కన్నా ఒక మంచి పుస్తకం మంచి మిత్రుడు అవుతుందన్నారు. వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ కార్యదర్శి లలిత, డిప్యూటీ లైబ్రేరియన్ గజేంద్రబాబు, బిలాల్, పూర్ణిమ, దేవి బాల, సుల్తానా భాను. తులసీరామ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జ్ఞాపకశక్తి మాయం: డీఎస్పీ



విద్యార్థికి మెమెంటోను ఇస్తున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడకం వల్ల మెదడు పనితీరును దెబ్బతిని జ్ఞాపకశక్తి పూర్తిగా మందగిస్తుందని డీఎస్పీ సాయినాథ్ పేర్కొన్నారు. గురువారం నాగయ్య కళాక్షేత్రంలో వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వాడకం, సైబర్ నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర, రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య మాట్లాడుతూ డ్రగ్స్, సోషల్ మీడియా వ్యసనం.. యువత లక్ష్యాలను దూరం చేస్తుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు మెమోంటోలను అందించారు. ఈ సమావేశంలో క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

నూతన ఖాజీలకు సన్మానం



చిత్తూరు సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గానికి ముగ్గురు ఖాజీలను నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నూతన ఖాజీలైన మౌలానా షేక్ ఇలాయాస్ షరీఫ్, ముఫ్తీషేక్ సమీయుల్లా, మౌలానా షేక్ షబ్బీర్‌లకు నియామక పత్రాలను అందజేసి, శాలువలతో సత్కరించారు.

అసౌకర్యాల నడుమ పొలకల హోమియో ఆస్పత్రి

చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్న గది ● పాముల బెడద

ఐరాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం పొలకలలోని హోమియోపతి ఆస్పత్రి అసౌకర్యాల నడుమ సాగుతోంది. అరకొర వసతులతో సిబ్బంది తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. పాటూరు-చిత్తూరు ప్రధాన రహదారిని అనుకుని ఈ ఆస్పత్రి ఉంది. ప్రతి రోజూ సుమారు 50 మంది వరకు రోగులు వచ్చి చికిత్సలు చేయించుకుంటున్నారు. అయితే ఈ ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు లేవు. డాక్టర్ శ్రీవాణి ప్రతి రోజూ వచ్చి రోగులకు చికిత్సలు చేస్తుంటారు. ఇటీవల కురుస్తున్న చిన్న వర్షానికి ఆస్పత్రి గది పూర్తిగా ఉరుస్తోంది. భవనం లోపల గోడలు పూర్తిగా చెమ్మగిల్లాయి. సిబ్బంది లోపల ఉండలేక పోతున్నారు. చికిత్స కోసం వచ్చిన వారికి ఆరుబయటే వైద్యం అందిస్తున్నారు. బయట కూడా పూర్తిగా బురదమయంగా ఉండటంతో డాక్టర్ ఇబ్బందులు పడుతూ చికిత్సలు చేస్తున్నారు. నిత్యం అధికారులు, నాయకులు ఈ మార్గం ద్వారా ప్రయాణిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పాముల బెడద..

ఆస్పత్రిలోపల, ప్రాంగణంలో నిత్యం పాములు సంచరిస్తున్నాయి. డాక్టర్‌ను, సిబ్బందిని, రోగులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వీటితో పాటు స్లాబు పెచ్చులూడి పడుతోంది. సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి హోమియోపతి ఆస్పత్రిని బాగు చేయాలని అక్కడకు విచ్చేసే రోగులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు.


చెమ్మగిల్లిపోయిన లోపలి గోడలు


ఆసుపత్రి వెలుపల వైద్యం చేస్తున్న డాక్టర్

ముట్టుకూరుపల్లె దారి సమస్య పరిష్కారం



దారిని పరిశీలిస్తున్న అధికారులు

గుడిపాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముట్టుకూరుపల్లె దారి సమస్యను రెవెన్యూ సిబ్బంది గురువారం ఎట్టకేలకు పరిష్కరించారు. గత ఐదు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో నడక దారి, చెరువు ఆక్రమణ గురవుతున్నా పట్టించుకోరా అన్న వార్తకు స్పందించిన తహసీల్దార్ శ్రీనివాసులు దారి సమస్య ఉన్న ప్రాంతానికి విచ్చేశారు. ఆక్రమణకు గురైన నడక దారిని సర్వే చేసి దారి సమస్యను పరిష్కరించారు. సర్వేయర్ గోపీనాథ్, టీడీపీ నాయకులు గోళ్ల హేమాద్రినాయుడు, ఉప సర్పంచ్ వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

లీకేజీ వాటర్ ట్యాంకులను బాగుచేయండి

గుడిపాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో లీకేజీ ఉన్న వాటర్ ట్యాంకులను గుర్తించి వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శిరీష, ఈవోఆర్డీ కృష్ణప్రసాద్, ఏఈలు ప్రసాద్‌నాయుడు, పవన్, శివకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ

గుడిపాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మసముద్రం క్రాస్ సమీపంలోని కనికలమ్మ ఆలయంలో బుధవారం రాత్రి అమ్మవారికి ఊంజల్ సేవను ఉభయదారులు మార్కొండరెడ్డి కుటుంబ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి రాత్రి అన్నప్రసాద వితరణ చేశారు. ● మండలంలోని పలుగ్రామాలలో అయ్యప్ప పడికట్ల పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తుమ్మవారిపల్లెలో, పానాటూరులోని మధురెడ్డి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అయ్యప్ప పూజలు చేశారు. మాజీ ఎంపీపీ నాగరాజుయాదవ్, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, మాజీ సర్పంచ్ మార్కొండయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల ఇన్‌సర్వీస్ టెట్ మినహాయింపునకు కృషి

పూతలపట్టు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇన్‌సర్వీస్ టెట్ నుంచి మినహాయింపునకు ప్రభుత్వం కృషి చేస్తోందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు అన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ మొట్టమొదటి సమావేశం పూతలపట్టు ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రెడ్డి రమేష్, జిల్లా ఆర్థిక కార్యదర్శి బాబురెడ్డి, చిత్తూరు మండల అధ్యక్షురాలు దేవిక, గౌరవాధ్యక్షులు లక్ష్మీపతి నాయుడు, యూనియన్ నేతలు బాలాజీ నాయుడు, రామచంద్ర నాయుడు, పట్టాభినాయుడు, బాలయ్యానాయుడు, మోహన్, రామానాయుడు, నియోజకవర్గ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షులు జార్జి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి ఎప్పుడు వచ్చినా డాక్టర్లుండరా?

సిబ్బందిని ప్రశ్నించిన టీడీపీ నాయకులు


వైఎస్.జగన్ బోర్డును పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు

గుడిపాల, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ఆస్పత్రికి ఎప్పుడు వచ్చినా డాక్టర్లు అందుబాటులో ఎందుకుండరని మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ్‌నాయుడు ఆస్ప త్రి సిబ్బందిని ప్రశ్నించారు. బొమ్మసముద్రం పీహెచ్‌సీలో వైఎస్ జగన్ ఫొటోతో కూడిన బోర్డు ఇప్పటికీ ఉందని కొందరు వారికి ఫిర్యాదు చేశారు. దీంతో వారు గురువారం ఆస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు సేవచేయడానికి ఉన్నారా లేక రాజకీయలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. బోర్డును తొలగించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్‌ఆర్ఐకి సన్మానం



పూతలపట్టు, నవం బరు 20 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పోటుకనుమ గ్రామా నికి చెందిన కాణిపాకం ట్రస్ట్ బోర్డు సభ్యుడు ఊట్ల నాగరాజు నాయుడు కుమారుడు ఎన్ఆర్ఐ ఊట్ల శ్యామ్‌సుందర్‌ను బుధవారం రాత్రి పోటుకనుమ ఎగువ దళితవాడకు చెందిన పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పోటుకనుమ ఎగువ దళితవాడకు మౌళిక వసతులు కల్పిస్తానని హామీఇచ్చారు. తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మాజీ అధ్యక్షులు సుబ్బ రాజు లు, సంజీవయ్య, జగన్నాథం, మనోహర్, చెంగల్రాయులు, రాఘవయ్య, చందు, వెంకటస్వామి పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం


దాతకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల(కాణిపాకం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన ట్రస్టుకు గుంటూరుకు చెందిన పెద్దిశ్రీధర్ గురువారం రూ.1,00,216 విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామిదర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామిశేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

పెనుమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలను ఇక్కడే పరిష్క రించాలని మండల స్థాయి అధికారులకు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. మండలాల్లో సమస్యలు పరిష్కరిస్తే కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు ఎందుకు అంతమంది వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సహకార రంగాన్ని బలోపేతం చేస్తాం

నగరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సహకార రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తామని పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజీ తెలియజేశారు. నగరి ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం కార్యాలయ ఆవరణలో 72వ అఖిలభారత సహకార వారోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సహకార సంఘ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో తుల సిపిళ్లై, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సురేష్‌నాయుడు, డైరెక్టర్ జవహర్‌లాల్ వెంకటేశ్వరులు, సిబ్బంది శేఖర్, గుణశేఖర్, కార్తీక్, లేపాక్షి, తనికాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబుకు సన్మానం



నగరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా నియమితులైన చినబాబును నగరి దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు కన్నెప్ప, గోవిందరెడ్డి ఘనంగా సన్మానించారు. గురువారం ఉదయం చినబాబును శాలువ, పూలమాలతో సన్మానించారు.

ఆలపాకంలో బాలల హక్కుల వారోత్సవాలు

విజయపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలపాకంలో గురువారం బాలల హక్కుల వారోత్సవం నిర్వహించారు. ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు సమావేశం నిర్వహించి బాలల హక్కులు, విధులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీగౌరి, ఉపాధ్యాయులు భాగ్యరాజ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ, అంగన్‌వాడీ కుమారి, శాంతి, అజంత, ఎలిజిబిత్, ఏఎన్ఎం సావిత్రి, మహిళా పోలీస్ సెల్వి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే థామస్ పర్యటన

పెనుమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఎమ్మెల్యే థామస్ హాజరవుతారని టీడీపీ మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు మండల అధికారులతో సమావేశం ఉంటుందని, 3 గంటలకు పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన చేపడుతారని తెలిపారు.

వ్యాస, చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బంగారుపాళ్యం నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసినట్లు గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ 50 విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్, నీతి పద్యాల పుస్తకాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం క్రిష్ణయ్య, తెలుగు ఉపాధ్యాయురాలు సుశీల, రిటైర్డు టీచర్లు షణ్ముగంపిళ్లై, జోహార్, విజ్ఞాన్ స్కూల్ ఉపాధ్యాయులు రవితేజ, హిమగిరి, దేవేంద్ర పాల్గొన్నారు.

ఓటరు మ్యాపింగ్‌పై బీఎల్వోలకు శిక్షణ

బంగారుపాళ్యం నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో భాగంగా బీఎల్వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు తహశీల్దార్ షబ్బీర్ బాషా గురువారం తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన శిక్షణా శిబిరంలో 2002 ఓటరు జాబితాని ప్రస్తుత జాబితాలోని ఓటర్లకు మ్యాపింగ్ చేయడంపై ఆయన శిక్షణ ఇచ్చారు.

సహాయ పరికరాల గుర్తింపు శిబిరానికి విశేష స్పందన


శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్

వెదురుకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో గురువారం దివ్యాంగులు, వృద్ధులకు సహాయ పరికరాల గుర్తింపునకు నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం, గంగాధరనెల్లూరు మండలాల వృద్ధులు, దివ్యాంగులకు సహాయ పరికరాల గుర్తింపు కోసం శిబిరం చేపట్టారు. పరికరాల కోసం 436 మంది దరఖాస్తులను అందజేశారు. వీరిలో 328 మందిని అర్హులుగా గుర్తించామని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. కాగా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ శిబిరాన్ని తనిఖీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమాధికారి జె.విక్రమకుమార్, నగరి ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే మనిషికి ఆత్మసంతృప్తి

● **పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్**


ఎన్ఆర్ఐ అనురాధను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవతోనే మనిషి ఆత్మసంతృప్తి ఉంటుందని ఎన్ఆర్ఐలు సమాజ సేవకు ముందుకు రావాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ అన్నారు. పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణలో కొర్లమిట్ట గ్రామానికి చెందిన దివంగత రామస్వామినాయుడు, జయలక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె ఎన్ఆర్ఐ అనురాధ, రామకృష్ణ దంపతులు రూ.15 లక్షలతో విద్యార్థుల కోసం డైనింగ్ హాలును నూతనంగా నిర్మించారు. ఈ భవనాన్ని ఎమ్మెల్యే మురళీ మోహన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, చదువుకుంటున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనురాధను ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడు ధరణీ ప్రసాద్, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, నాయకులు గుంటూరు మురళి, హరి, నాగరాజు, దాము, శేషాద్రి, చిరంజీవి నాయుడు, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, క్రిష్ణమూర్తి, నాదముని, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నూతన ఖాజీలకు సన్మానం



చిత్తూరు సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గానికి ముగ్గురు ఖాజీలను నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నూతన ఖాజీలైన మౌలానా షేక్ ఇలాయాస్ షరీఫ్, ముఫ్తీషేక్ సమీయుల్లా, మౌలానా షేక్ షబ్బీర్‌లకు నియామక పత్రాలను అందజేసి, శాలువలతో సత్కరించారు. అనంతరం ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు కాలేషా, నేతలు అత్తుబాయ్ పాల్గొన్నారు.

నగరపాలక కార్యాలయం నుంచే ప్లాస్టిక్ నిషేధం అమలు చేద్దాం

● **కమిషనర్ నరసింహ ప్రసాద్**

చిత్తూరు అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, నగరపాలక కార్యాలయం నుంచే ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేద్దామని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ చెప్పారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 ప్రకారం నగరపాలక ఉద్యోగులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులంతా ప్లాస్టిక్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా ఉగ్యోగులకు స్టీల్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఎంహెచ్ వో లోకేష్, ఏసీపీ నాగేంద్ర, టీపీవో శుభప్రభ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం


మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు

నగరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సహజ ఎరువులను వినియోగించి ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఆరోగ్యానికి, పర్యావరణానికి నేలకు, రైతుకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వ్యవసాయంపై వీహెచ్ఏ, వీఏఏ, వీఎస్ఏ, రైతు సేవా కేంద్రం అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆకు కూరలు, ఆయిల్ పామ్ వంటి పంటలు సాగుచేసి అధికంగా ఆదాయాన్ని పొందాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, టెక్నికల్ ఎంఏవో అజిత, ఆత్మ బీటీఎం దేవేంద్ర, ప్రకృతి వ్యవసాయం విభాగం ఎన్ఎఫ్ఏ నాంచారమ్మ నవీన్, ట్రైనర్లు చంద్రశేఖర్, రాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జ్ఞాపకశక్తి మాయం: డీఎస్పీ


విద్యార్థికి మెమెంటోను ఇస్తున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడకం వల్ల మెదడు పనితీరును దెబ్బతిని జ్ఞాపకశక్తి పూర్తిగా మందగిస్తుందని డీఎస్పీ సాయినాథ్ పేర్కొన్నారు. గురువారం నాగయ్య కళాక్షేత్రంలో వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వాడకం, సైబర్ నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర, రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య మాట్లాడుతూ డ్రగ్స్ సోషల్ మీడియా వ్యసనం.. యువత లక్ష్యాలను దూరం చేస్తుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు మెమోంటోలను అందించారు. ఈ సమావేశంలో క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

బంగారుపాళ్యం నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు గురువారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని నల్లంగాడుకు చెందిన ఈశ్వరయ్య, కవిత దంపతుల కుమార్తె హారిక చిత్తూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతోంది. ఈ నెల 18వ తేదీన కాలేజీకి వెళ్లివస్తానని ఇంటిలో చెప్పి వెళ్లింది. ఆ తర్వాత తిరిగి రాలేదు. బాలిక తల్లి కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పుస్తకాలే మంచి నేస్తాలు

● **ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్**
● **ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు**


వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు మంచి నేస్తాలని విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం విజయం కళాశాల సమావేశ మందిరంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా ఎంతో జ్ఞానం సంపాదించుకోవచ్చునన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ మాట్లాడుతూ పిల్లలు నీతి కథలు చదవాలని తద్వారా నిజాయితీని అలవరచుకుంటారన్నారు. వంద మంది స్నేహితులు కన్నా ఒక మంచి పుస్తకం మంచి మిత్రుడు అవుతుందన్నారు. వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ కార్యదర్శి లలిత, డిప్యూటీ లైబ్రేరియన్ గజేంద్రబాబు, బిలాల్, పూర్ణిమ, దేవి బాల, సుల్తానా బాను. తులసీరామ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ

శ్రీరంగరాజపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లె మిట్ట గ్రామంలో గురువారం వైసీపీ ఉమ్మడి జిల్లా క్రియాశీలక కార్యదర్శి, మాజీ సర్పంచ్ విజయబాబు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొన్న శ్యామ్‌రాజ్ కో-ఆప్షన్ మెంబర్ ఏసురత్నం, రిటైడ్ హెచ్ఎం దొరస్వామి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

రాయితీపై చాప్ కట్టర్లు

వెదురుకుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 50 శాతం రాయితీపై చాప్ కట్టర్లను అంది స్తున్నట్లు వెదురుకుప్పం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రూపసుందరి గురువారం తెలిపారు. కావలసిన రైతులు ఆధార్ కార్డుతో పశువైద్య కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. చాప్ కట్టర్ల ధర మార్కెట్లో రూ.40,500 అని రాయితీతో రూ.20,250కే అందిస్తున్నా మని తెలియజేశారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన టీడీపీ అధ్యక్షుడు



వెదురుకుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గురువారం రాయచోటిలో కలసినట్లు వెదురుకుప్పం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి.మోహన్‌మురళి తెలిపారు. శాలువ కప్పి సత్కరించినట్లు తెలిపారు. మండల అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వడంతో సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కలెక్టర్‌ను స్వాగతించిన మాల కార్పొరేషన్ డైరెక్టర్

వెదురుకుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో గురువారం నిర్వహించిన దివ్యాంగులకు, వయో వృద్ధులకు అవసరమైన సహాయ పరికరాల గుర్తింపు శిబిరానికి వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్, నగరి ఆర్డీవో అనుమమను మాల కార్పొరేషన్ డైరెక్టర్, జీడీ నెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న స్వాగతించారు.

పెద్దపేగు క్యాన్సర్‌పై అవగాహన శిబిరం


అగ్గిచేనుపల్లిలో అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి

వెదురుకుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో గురువారం పెద్దపేగు క్యాన్సర్‌పై స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. ఉమాదేవి హాజరయ్యారు. ఈ వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలను వివరించారు. మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్టు అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన పేడ దిబ్బలు వేస్తే చర్యలు

వెదురుకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన పేడ దిబ్బలు, చెత్తచెదారం వేస్తే చర్యలు తప్పవని వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లె గ్రామ సర్పంచ్ బండి శశిఆనందరెడ్డి, కార్యదర్శి ధనంజయ తెలిపారు. గురువారం పెరుమాళ్లపల్లె నుంచి పెరుమాళ్లపల్లె కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా క్లీనింగ్ పనులు చేపట్టారు.

నేడు ప్రజా దర్బార్

పూతలపట్టు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు దొర బాబు చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మురళీమోహన్ విచ్చేసి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.